క్లుప్తంగా

ముగిసిన వార్షికోత్సవాలు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో 41వ వార్షికోత్సవాలు గురువారం ముగిశాయి. చివరిరోజు అమ్మవారికి ప్రత్యేకలంకరణ, పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది మీగడ కాశీనాథ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం ఏడీఏగా సుధారాణి



బాధ్యతలు స్వీకరిస్తున్న సుధారాణి

మహేశ్వరం: మహేశ్వరం సహాయ వ్యవసాయ సంచాలకురాలి(ఏడీఏ)గా ఎం.సుధారాణి గురువారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహేశ్వరం డివిజన్‌లోని అన్ని మండలాల్లో ఉన్న రైతుల సంక్షేమానికి నిరంతరం పనిచేస్తామన్నారు. అర్హత కలిగిన ప్రతీ రైతుకు రైతు భరోసా, బీమాతో పాటు రుణ మాఫీ అందే విధంగా తనవంతు కృషి చేస్తామన్నారు. రైతులకు పంటల సాగుపై ఎప్పటికప్పుడూ సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. నూతన ఏడీఏ సుధారాణి సంగారెడ్డి జిల్లా జోగిపేట్ డివిజన్ నుంచి బదిలీపై మహేశ్వరానికి వచ్చారు. మహేశ్వరంలో ఇదివరకు ఏడీఏగా పనిచేసిన సుజాత ఇబ్రహీంపట్నంకి బదిలీపై వెళ్లారు. డివిజన్‌లో ఉన్న వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఆమె స్వాగతం తెలుపుతూ పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

దళితబంధు వర్తింపచేయండి

కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళితబంధు కమిటీ సభ్యులు

హుడాకాంప్లెక్స్: దళితబంధు పథకం కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి వర్తింపచేయాలని కోరుతూ సరూర్‌నగర్ మండల తహసీల్దార్‌కు గురువారం దళితబంధు కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ సరూర్‌నగర్ డివిజన్‌లో దళితబంధుకోసం సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించామని, చివరి క్షణంలో ఎన్నికల కోడ్ కారణంగా లబ్ధిదారులకు మంజూరు చేయలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మాదాసు వెంకటేశ్, కోశాధికారి బోయ శివకుమార్, సంయుక్త కార్యదర్శులు మొగిళ్ల మల్లేశ్, కందుల రాము, సభ్యులు గోపాల్, మాదురి, బేర శృతి, ప్రసాద్‌లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



అధికారికి వినతిపత్రం అందిస్తున్న కార్మిక సంఘం నాయకులు

కందుకూరు: జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కందుకూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. ఆరునెలలుగా కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 45 రోజుల్లో గుర్తింపు కార్డులు, దుస్తులు, మాస్కులు, సబ్బులు ఇస్తామని అధికారులు చెప్పినా ఇంతవరకు అందలేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, సంఘం నాయకులు నర్సింహ, రాములు, యాదయ్య, జంగయ్య, మల్లేశ్, జంగమ్మ, లక్ష్మమ్మ, రాధిక, మిత్ర, సుమిత్ర, అలివేలు, రాణి, భాగ్యలక్ష్మి, మమత తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పరిసరాలకు ముప్పు!



చెత్త, ప్లాస్టిక్‌తో నిండిన కాల్వ

- వ్యర్థాలతో నిండిన కాలువ
- పట్టించుకోని అధికారులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ కేంద్రంలో ఓఆర్ఆర్ ఎగ్జిట్ 14 పరిసర ప్రాంతం పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయింది. కాలువ గుండా నీరు పోకుండా తయారైంది. ఈ విషయాన్ని పట్టించుకునే వారు లేరు. ముఖ్యంగా సర్వీస్ రోడ్డులో ఇరువైపులా వర్షపు నీరు ప్రవహించడానికి ఏర్పాటు చేసిన కాల్వలు నిండిపోయాయి. ఈ కాల్వల్లో ప్లాస్టిక్ కాగితాలు, ఇసుక రేణువులు, చెత్తా చెదారం చేరాయి. ముఖ్యంగా ప్లాస్టిక్‌తో పరిసరాలకు ముప్పు వాటిల్లుతుందని తెలిసిందే. పేరుకపోతున్న చెత్త, మురికి నీరు, వర్షపు నీరు కాల్వలో చేరి దుర్వాసన వెదజల్లడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఓఆర్ఆర్ నిర్వాహకులు స్పందించి కాల్వలను శుభ్రం చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.



హోమం చేస్తున్న నిర్వాహకులు

పెద్దమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

కందుకూరు: మండల పరిధిలోని సార్లరావులపల్లిలో పెద్దమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి గురువారం మాజీ సర్పంచ్ రజితప్రవీణ్‌నాయక్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. వేద బ్రాహ్మణుల సమక్షంలో భూమిపూజ అనంతరం హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు శ్రీనునాయక్, భీంరావు, లక్ష్మీపతి నాయక్, కవితశ్రీరామ్, జోషి, సోమలనాయక్, సుమన్, శ్రీనివాస్, లచ్చీరాం, రాజేశ్, హరిలాల్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

మహిళా జర్నలిస్ట్‌లపై దాడి హేయమైన చర్య

మహేశ్వరం: ఇందిరమ్మ పాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంతూరులో మహిళా జర్నలిస్ట్‌లపై అనుచరులు దాడి చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షర్ఫుద్దీన్ హామేద్ విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో రుణమాఫీ పూర్తి స్థాయిలో జరిగిందా..? అనే విషయమై తెలుసుకున్న ఇద్దరు మహిళా జర్నలిస్ట్‌లపై కాంగ్రెస్ నాయకుడు దాడికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలన్నారు. మహిళా జర్నలిస్ట్‌లపై దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించడంతో పాటు మహిళా కమిషన్ కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్



మహేశ్వరంలో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



బడంగ్‌పేట్: ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

- అర్హులందరికీ రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

మహేశ్వరం: షరతులు లేకుండా అర్హత కలిగిన ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం మండల కేంద్రం బీఆర్.అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తోందన్నారు. ఎన్నికలకు ముందు అర్హత కలిగిన ప్రతీ రైతుకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి, సభలో రైతులకు హామీ ఇచ్చి ఇప్పుడు కొందరికే రుణమాఫీ చేసి సాంకేతిక సమస్యలంటూ సాకులు చెబుతోందని విమర్శించారు. షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతకుముందు రైతులతో ధర్నా కార్యక్రమం నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యాక్షులు లక్ష్మీనర్సింహారెడ్డి, అరవింద్ శర్మ, బీఆర్ఎస్ మండల మహిళా నాయకురాలు శివగళ్ల లావణ్య, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు దయ్యాల శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం, నాయకులు కె.చంద్రయ్య, ఎం.నవీన్, ప్రభాకర్‌రెడ్డి, సాదత్, ప్రభాకర్, అదిల్, బాలయ్య, సంజయ్, బాల్‌రాజ్, రవినాయక్, మేఘనాథ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సంజీవ, దేవరంగౌడ్, కృష్ణ, పాండు, దర్శన్, మహేందర్ పాల్గొన్నారు.

బడంగ్‌పేటలో..

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం మండల బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 40 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. బాలాపూర్ మండలంలో రెండు సహకార సంఘాలు ఉంటే అందులోని రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పాలిట శాపంగా మారాడని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందన్నారు. సీఎంకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం బాలాపూర్ ఇన్‌చార్జి తహసీల్దార్ వేణుగోపాల్‌కు రుణమాఫీ చేయాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ మీర్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, భాగ్యనగర్ సహకార సొసైటీ చైర్మన్ నర్సింహరెడ్డి, జల్‌పల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ హమీద్ షర్ఫుద్దీన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బడంగ్‌పేట్: బాలాపూర్‌లోని బద్దం బాల్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బిజినెస్ స్కూల్‌లో(పీజీ) గురువారం విద్యార్థులకు వర్క్‌షిప్ ఆన్ యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి బి.జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ర్యాగింగ్ అనేది అతిపెద్ద నేరమన్నారు. దీంతో ర్యాగింగ్‌కు గురవుతున్న విద్యార్థులు ఏదో కోల్పోయామని జీవితాంతం బాధపడుతూ మానసిక క్షోభకు గురవుతూ ఉంటారన్నారు. ర్యాగింగ్ చేసిన వ్యక్తులపై కక్ష్యలు పెట్టుకుని నేరబాటలోకి వెళ్తున్నారని గుర్తుచేశారు. అవమానాన్ని తట్టుకోలేని విద్యార్థినీ విద్యార్థులు సూసైడ్‌లకు పాల్పడుతున్నారన్నారు. పిల్లల భవిష్యత్‌పై ఆశలు పెట్టుకున్న తల్లితండ్రులు అప్పులపాలు అవుతూ ఒంటరి వారుగా మారి శోకసంద్రంలో మునిగిపోతున్నారని విద్యార్థులకు వివరించారు. ర్యాగింగ్ అనే భూతాన్ని పాఠశాలలు, కళాశాలల నుంచి పారద్రోలాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ర్యాగింగ్‌ను ప్రోత్సహించడం కూడా తప్పన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ప్రయోజకులు కావాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని యాంటీ ర్యాగింగ్‌పై ర్యాలీ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బి.సునీతారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.జే.మాధవిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శ్రీనివాస్‌గౌడ్



మహేశ్వరం: బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కల్వకోల్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కాసాని శ్రీనివాస్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవేళ్ల మహేందర్ ఉత్తర్వు లు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ చేసిన తప్పులే కాంగ్రెస్ చేస్తోందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని నేటికీ ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయకుండా మోసం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ పట్ల యు వతను ఆకర్శితులను చేస్తామన్నారు. ఈ నియామకం తనపై మరింత బాధ్యత పెరిగింద న్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా అనిల్

హుడాకాంప్లెక్స్: యువమోర్చా రాష్ట్ర ఎగ్జి క్యూటీవ్ మెంబర్‌గా సిల్వేరి అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సంద ర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపా రు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ఇబ్రహీంపట్నం: ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక పేర్కొన్నారు. జాతీయ సేవా విభాగం, జాతీయ విద్యా విషయక విభాగాల ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన నిర్వహించి, గోడ పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రతతోనే వ్యాధులు దరి చేరవన్నారు. రానున్న వినాయక చవితికి మట్టితో తయారు చేసిన ప్రతిమలను పెట్టి పూజించాలని కోరారు. పర్యావరణం బాగుంటేనే మనుషుల మనుగడ సాఫీగా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేష్, ఎస్ రమేష్, చింతల రాకేష్, భవానీ, రచన పాల్గొన్నారు.



గోడపత్రికను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ రాధిక, అధ్యాపకులు

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



అమ్మవారికి పూజలు చేస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ పోస్టల్ కాలనీలో గురువారం పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరినీ చల్లంగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జెల్ల రమేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్, నర్సింగ్ రావు, చంద్రయ్య, గణేశ్, చంద్రకుమార్, రాము, మహిళలు పాల్గొన్నారు.

23వ డివిజన్‌లో..

23వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ రాళ్లగూడెం సంతోషీశ్రీనివాస్‌రెడ్డితో కలిసి మేయర్ పారిజాత డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రోమా ఎన్‌క్లేవ్, మారుతీ నగర్, బీరప్ప కాలనీల్లో డ్రైనేజీ పనులు పూర్తి చేసి ప్రజలకు, కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. డివిజన్‌లో ఎలాంటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీనిచ్చారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

- జెడ్పీటీసీ మాజీ సభ్యులు ఉప్పల వెంకటేశ్, డాక్టర్ అఖిల్



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తలకొండపల్లి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని జెడ్పీటీసీ మాజీ సభ్యులు ఉప్పల వెంకటేశ్, డాక్టర్ అఖిల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మెదక్‌పల్లిలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు ఉప్పల వెంకటేశ్, డాక్టర్ అఖిల్, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి, సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 155 మంది రోగులకు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, వైరల్ ఫీవర్ వంటి వాటికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కలుషిత నీటి నివారణకు క్లోరినేషన్ చేసి లేదా కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. అపరిశుభ్రంగా ఉండే ఆహారాన్ని తీసుకోవద్దని, వేడివేడి ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నరేష్, దర్పుల శంకర్, అశోక్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్, రజనీకాంత్, అశోక్, మనోహర్, రాములు, శ్రీశైలం, నవీన్, పాండు, దయాకర్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో మానవ మనుగడ

- ఎంపీడీఓ శ్రీకాంత్

తలకొండపల్లి: మొక్కలతోనే మానవ మనుగడ ఉంటుందని ఎంపీడీఓ శ్రీకాంత్ పేర్కొన్నారు. పచ్చని చెట్లు–ప్రగతికి మెట్లని, చెట్లుంటే క్షేమం, లేకుంటే క్షామం అని పేర్కొన్నారు. మేరి లైఫ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా 'నాటుదాం–ఒక్క చెట్టు అమ్మ పేరు మీద' అనే కార్యక్రమాన్ని గురువారం హర్య నాయక్ తండాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్త ప్రాణ కోటికి చెట్లే ప్రాణాధారమని తెలిపారు. మొక్కల పెంపకంతో అడవులు పెరిగి సమృద్ధిగా వర్షాలు కురిసి వ్యవసాయ రంగం గణనీయంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కృష్ణ, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు



బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



రావిర్యాలలో ఎడ్లబండ్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు

కందుకూరు: కందుకూరులో గురువారం పోచమ్మ, మైసమ్మ తల్లి బోనాలను వైభవంగా నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

రావిర్యాలలో..

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామంలో శ్రావణమాసం సందర్భంగా గురువారం పోచమ్మ, కట్ట మైసమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు డప్పుచప్పుళ్ల, పోతురాజుల విన్యాసాల మధ్య బోనాలతో ఆలయాలకు చేరుకొని అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో ఎడ్లబండ్లను ప్రత్యేకంగా అలంకరణ చేసి ఆలయాలు చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.